క్లుప్తంగా

స్వయం భువుడికి కూరగాయల అలంకరణ



మాకవరపాలెం: స్వయం భూ లింగానికి కూరగాయలతో అలంకరణ చేశారు. శుక్రవారం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని గురువారం మండలంలోని పెద్దమిల్లు జంక్షన్ వద్దనున్న వామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా అన్ని రకాల కూరగాయలతో స్వయం భూ లింగానికి అలంకరణ చేశారు. ఆలయ అర్చకుడు దొరబాబు మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం ఈ కూరగాయలతో వంటలు చేసి, భక్తులకు అన్నసమారాధన చేయనున్నట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న సర్పంచ్ శిరీష, తదితరులు

మాకవరపాలెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య, నోట్ పుస్తకాలను గురువారం సర్పంచ్ అల్లంపల్లి శిరీష, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రుత్తల శేషుకుమార్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలం రాము, కళాశాల ప్రిన్సిపాల్ సుందరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పింఛనుదారుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమేశ్వరరావు

మాకవరపాలెం: ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పింఛనుదారుల సంఘ రాష్ట్ర అదనపు కార్యదర్శి సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని తామరంలో గురువారం నిర్వహించిన మండల పింఛనుదారుల సంఘ 19వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీతో పాటు ఇతర బకాయిల్ని వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు మాట్లాడుతూ పింఛనుదారులంతా సమష్టిగా కృషి చేస్తే, డిమాండ్లను సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి జిల్లా కార్యదర్శులు జగన్నాథరావు, శర్మ, మండల పింఛనుదారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, రంగరాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్‌తో ఉపాధి, దేశ సేవ



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సందీప్

నర్సీపట్నం: దేశ సేవకు యువత అంకితం కావాలన్న కల ఎయిర్ ఫోర్స్‌లో చేరడం ద్వారా నెరవేరుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాజు పేర్కొన్నారు. సెంట్రల్ ఎయిర్‌మెన్ సెలక్షన్ బోర్డు ఆధ్వర్యంలో అగ్నిపథ్ పథకంలో అగ్నివీర్వాయు పోస్టుల భర్తీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని వీర్వాయు ఉద్యోగాల కోసం యువతను ప్రోత్సహించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఎయిర్‌ఫోర్స్‌లో స్థిరపడేందుకు యువత ముందుకు రావాలన్నారు. సికింద్రాబాద్ ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ నాన్ కమిషన్డ్ అధికారులు ఎస్.సందీప్, దేవకాంత్ మిశ్రా మాట్లాడుతూ ఎయిర్‌ఫోర్స్ కేవలం ఉపాధి కోసం కాదని, దేశ సేవలో దాని పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై హర్షం

మాకవరపాలెం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుతో ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం నేటికి ఫలించిందని నియోజకవర్గ కన్వీనర్ బిక్కవోలు ప్రసాద్ తెలిపారు. ఈ వర్గీకరణతో ఉపకులాలకు మేలు జరుగుతుందన్నారు.

నిధులు వెనక్కి.. సమస్యలు మొదటికి

- పీహెచ్‌సీలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం
- వారం రోజులుగా పీహెచ్‌సీల్లో టైఫాయిడ్ కిట్లు నిల్!
- టైఫాయిడ్ పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లే దిక్కు
- హెచ్‌డీఎస్ నిధులు వెనక్కి తీసుకోవడంతో ఇబ్బందులు

కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ప్రాధాన్యతలు మారాయి. వైఎస్ జగన్ ప్రభుత్వం వైద్యానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. గ్రామస్థాయిలో హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. వందకుపైగా మందులు, వైద్య పరికరాలు, టెస్టింగ్ కిట్లు ఇలా అవసరమైన ఏర్పాట్లన్నీ చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజారోగ్యానికి అనారోగ్యం దాపురించింది. గత ప్రభుత్వం సమకూర్చిన మందులు, కిట్లు అయిపోవడం, ఉన్న నిధుల్ని వెనక్కి తీసుకోవడంతో సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. మాడుగుల మండలంలో అతి పెద్ద పీహెచ్‌సీ కేజే పురంతోపాటు, కింతలి తదితర పీహెచ్‌సీల్లో టైఫాయిడ్ కిట్ల కొరతతో రోగులు అల్లాడుతున్నారు.



కేజే పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

మాడుగుల రూరల్: పక్షం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాలల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. కీళ్ల నొప్పులు, దగ్గు, జలుబు వంటి లక్షణాలతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. కె.జె.పురంతో పాటు కింతలి పీహెచ్‌సీలో టైఫాయిడ్ నిర్ధారణ కిట్లకు కొరత ఏర్పడింది. వారం రోజుల క్రితమే కిట్లు అయిపోయాయని, ఇప్పటి వరకు స్టాక్ రాలేదని ఆయా పీహెచ్‌సీ వైద్యాధికార్లు చెప్తున్నారు. ఒక్క కేజే పురం పీహెచ్‌సీ పరిధిలోనే సుమారు 30 వేల మంది జనాభా ఉన్నారు. గత ప్రభుత్వంలో వీరంతా ఏ చిన్న అనారోగ్యం తలెత్తినా పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకుని, వైద్యం పొందేవారు. అదే నమ్మకంతో ఆస్పత్రికి వస్తున్న రోగులు ప్రస్తుతం నిరాశగా వెనుదిరుగుతున్నారు.

వారం రోజుల నుంచీ ఇదే స్థితి

జిల్లాలోని పీహెచ్‌సీలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డ్రగ్స్ స్టోర్ నుంచి అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారిత కిట్లు ఎప్పటికప్పుడు సరఫరా కావాలి. వర్షాకాలంలో సీజనల్ రోగాలు ఎక్కువగా ప్రబలుతాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూపై అధికారులు మాసోత్సవాలు నిర్వహించి మరీ ఊరూ వాడా ఊదరగొట్టారు. అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్ల సరఫరాలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారు. వారం రోజులుగా పీహెచ్‌సీల్లో టైఫాయిడ్ కిట్లు లేకపోవడంతో అనుమానిత రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లు, క్లినిక్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇందుకు భారీగా డబ్బులు చెల్లించుకోలేక పేద గిరిజన రోగులు నానా అగచాట్లు పడుతున్నారు. రెండు మాసాల వ్యవధిలో పీహెచ్‌సీ పరిధిలో 10 టైఫాయిడ్ కేసులు నిర్ధారణయ్యాయి. సీజనల్ రోగాలు విపరీతంగా ఉన్న ఈ సమయంలో కిట్లు లేకపోవం రోగ నిర్ధారణ జరగక, సరైన వైద్యం పొందలేని పరిస్థితి నెలకొంది.

హెచ్‌డీఎస్ నిధులు వెనక్కి

ఏటా ప్రతి పీహెచ్‌సీకి హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డీఎస్) నిధులు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వస్తాయి. ఈ నిధులను పీహెచ్‌సీ అవసరాలకు వినియోగించుకుంటారు. కేజే పురం పీహెచ్‌సీలో వ్యయం కాకుండా మిగిలి ఉన్న రూ.80 వేల నిధుల్ని వెనక్కి తీసుకున్నారు. మిగిలిన పీహెచ్‌సీల్లో కూడా ఇదే తీరున వ్యవహరించినట్లు సమాచారం. దీంతో అవసరమైన సమయంలో నిధుల్లేక పీహెచ్‌సీ వైద్యాధికారులు చేష్టలుడిగి చూడాల్సిన పరిస్థితి దాపురించింది. రోగులకు తమ శక్తిమేర వైద్య సేవలు అందించగలం తప్ప, జేబులో డబ్బులు వెచ్చించి పరికరాలు, మందులు కొనలేం కదా.. అని సిబ్బంది చేతులెత్తేస్తున్నారు.

కిట్లు అందుబాటులో ఉంచాలి



తాజా వర్షాలకు గ్రామాల్లో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి జ్వరాలు విజృంభిస్తున్నాయి. చాలా మంది మంచానపడ్డారు. పీహెచ్‌సీల్లో అన్ని రకాల మందులు, పరీక్షల కిట్లు అందుబాటులో ఉంచాలి. టైఫాయిడ్ కిట్లు లేకపోవడంతో మా వాళ్లను ప్రైవేట్ ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వచ్చింది. చాలా డబ్బు ఖర్చయింది. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– పి.మాలినాయుడు, కె.జె.పురం

రోగాల బారిన గిరిజనం



గిరిజన గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వరాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పూర్తి స్థాయిలో మందులు, ఇంజక్షన్లు, టైఫాయిడ్ కిట్లు లేక గిరిజన్లు మృత్యువాత పడుతున్నారు. గతంలో దోమ తెరలు సరఫరా చేసేవారు. ఇపుడవీ లేవు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. అన్ని రకాలు మందులు, పరికరాలు వెంటనే సరఫరా చెయ్యాలి

– ఇరటా నర్సింహమూర్తి, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి

హెచ్‌డీఎస్ నిధుల్లేవు



టైఫాయిడ్ కిట్ల కొనుగోలుకు హెచ్‌డీఎస్ నిధులు లేవు. ఏడాదికి ఒక పీహెచ్‌సీకి రూ.1.50 లక్షలు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంజూరు చేస్తుంది. మా పీహెచ్‌సీకి మంజూరైన ఈ నిధుల్లో రూ.80 వేలు వెనక్కి తీసుకున్నారు. ప్రస్తుతం టైఫాయిడ్ కిట్లు కొనుగోలు చేసేందుకు మా వద్ద నిధుల్లేవు. హెచ్‌డీసీఎస్ నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు వచ్చిన వెంటనే కిట్లు కొనుగోలు చేస్తాం.

– ఎల్‌వీఎస్ఎస్ ప్రసాదుపాత్రుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి, కేజే పురం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కిరణ్‌కుమార్



బాధ్యతలు స్వీకరించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పి.కిరణ్‌కుమార్ గురువారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఇప్పటి వరకు కళాశాల ప్రిన్సిపాల్‌గా చేసిన డాక్టర్ టి.రాధాకృష్ణతో పాటు సీనియర్ ఉపన్యాసకులు, ఫిజిక్స్ విభాగాధిపతి ఎస్.ఎం.రఫీయుద్దీన్‌లు ఉద్యోగ విరమణ చేశారు. వీరిని కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. నూతనంగా ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టిన కిరణ్‌కుమార్‌ను సాదరంగా స్వాగతించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరపు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి గడువు ఈ నెల 5 వరకు ఉన్నందున విద్యార్థులు తమ ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐవీవీ సత్యవతి, వి.రత్న భారతి, డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, ఏ.కృష్ణారావు, హెచ్.సుధీర్‌బాబు, సీహెచ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దండుముత్యాలమ్మ పండగ

కె.కోటపాడు: చౌడువాడ గ్రామస్తులు దండుముత్యాలమ్మ పండగను గురువారం ఘనంగా జరిపారు. అమ్మవారి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సతకంపట్టు నుంచి చెక్క గుర్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

జోరందుకున్న వరి నాట్లు



ఎం.కోడూరులో వరినాట్లు వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: పది రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలకు పంట భూముల్లో నీరు చేరింది. దీంతో రైతులు దమ్ములుపట్టి, వరి నాట్లకు సిద్ధమయ్యారు. తాచేరు, శారదానది, పాలగెడ్డ, చింతగెడ్డ నుంచి వస్తున్న నీటితో చెరువులు, జలాశయాలు కళకళలాడుతున్నాయి. మండలంలోని పెద్దేరు, తారకరామ, గొర్రిగెడ్డ, పాలగెడ్డ జలాశయాల్లో నీటి మట్టాలు గణనీయంగా పెరిగాయి. వరినారు కూడా పచ్చగా ఎదగడంతో రైతులు నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది మండలంలో సుమారు 13 వేల ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా అధికారుల అంచనా. వాతావరణ పరిస్థితుల అనుకూలత నేపథ్యంలో లక్ష్యానికి మించి సాగు విస్తీర్ణం పెరగవచ్చని రైతులు చెప్తున్నారు. రైతులంతా ఒకేసారి నాట్లుకు సిద్ధమవడంతో మహిళా కూలీలకు, దమ్ము పట్టే ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లకు డిమాండ్ నెలకొంది.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



గొలుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



కె.కోటపాడులో తల్లిపాల ఆవశ్యకత ర్యాలీలో సూపర్‌వైజర్ సుశీల, కుమారి

గొలుగొండ: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పీవో కేకేవీబీ శ్రీగౌరి, గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. గురువారం తల్లిపాల వారోత్సవాలపై అంగన్‌వాడీ సిబ్బంది ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది పీహెచ్‌సీ నుంచి బ్యాంక్ వరకు ర్యాలీ జరిపి, తల్లిపాల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భిణులకు, బాలింతలకు దీనిపై అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది అవగాహన కలిగించాలన్నారు.

కె.కోటపాడు: పుట్టిన చిన్నారులకు వెంటనే తల్లిపాలను అందించాలని కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ సుశీల అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త డోకల కుమారి మాట్లాడుతూ తల్లిపాలలో అధికమైన ఔషధ గుణాలు ఉండడం వల్ల, బిడ్డకు వచ్చే వ్యాధులను ఎదుర్కోవచ్చన్నారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకూ బిడ్డకు తల్లిపాలను మాత్రమే అందించాలన్నారు. బిడ్డకు రెండేళ్లు వచ్చేంత వరకు అనుబంధ ఆహారాన్ని అందించాలని వివరించారు. అనంతరం గ్రామంలో తల్లిపాల విశిష్టతను వివరిస్తూ అవగాహన ర్యాలీ జరిపారు.

రోలుగుంట: మండలం కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీహెచ్‌సీ వైద్యులు కె.ధనలక్ష్మి, శ్రావణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బందితో కలసి ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తల్లిపాల ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డబ్బాపాలకు, తల్లిపాలకు గల వ్యత్యాసాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎస్.కృష్ణ, షాజహాన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాత్రిపూట పెద్దేరులో దిగరాదు

మాడుగుల: పెద్దేరు జలాశయం క్యాచ్‌మెంట్ ఏరియాలో నాలుగు రోజులుగా వర్షాలు అధికమైనట్లు జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రోజుకు 300 క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చి చేరడంతో జలాశయం నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకుందన్నారు. దీంతో రాత్రి సమయాల్లో పెద్దేరులోకి వరద నీరు విడుదల చేస్తున్నామని, రాత్రి పూట పెద్దేరులో ఎవరూ దిగరాదని హెచ్చరించారు.

మాకిరెడ్డి పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం



దేముడు స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి. ప్రజా సంఘాల నాయకులు

నర్సీపట్నం: సీపీఐ నాయకుడు, రైతు ఉద్యమనేత మాకిరెడ్డి దేముడు ప్రథమ వర్ధంతి మండలంలోని గబ్బాడలో గురువారం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ప్రజాసంఘాల నాయకులు, బంధుమిత్రులు దేముడు స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. జేవీ మాట్లాడుతూ 98 ఏళ్ల వయసులో కూడా చివరి క్షణం వరకు ఎర్రజెండా పక్షాన నిలిచి, అనేక భూ పోరాటాలు చేసిన దేముడును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం సీనియర్ నాయకుడు రావుజగ్గారావు, జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, కొయ్యూరు జెడ్పీటీసీ వారా నూకరాజు, రాష్ట్ర సమితి నాయకులు అచ్యుత్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుబ్బలక్ష్మి, సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సియోను ప్రార్థన మందిర వార్షికోత్సవం



దేవరాపల్లి: మండలంలోని కాశీపురం సియోను ప్రార్థన మందిరం 46వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. నిస్సీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ డా.గొర్లె టైటస్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో కేక్‌ను కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వాక్యోపదేశం అనంతరం గ్రేస్ టైటస్, సంఘ సభ్యులు జీసస్ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పాస్టర్ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ



మాడుగుల రూరల్ : బిళ్లలపాలెంలో వృద్ధులకు పింఛను అందిస్తున్న సచివాలయ సిబ్బంది



నాతవరం: లబ్ధిదారుడికి పింఛన్ నగదు అందిస్తున్న ఎంపీడీవో రాంబాబు



మాకవరపాలెం: కొండల అగ్రహారంలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంఈవో మూర్తి

మాడుగుల రూరల్: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను గురువారం తెల్లవారుజాము నుంచి సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలోని 11,803 మంది లబ్ధిదార్లకు గాను, సాయంత్రానికి 11,376 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఆర్.కాళీప్రసాదురావు తెలిపారు. తొలి రోజు 97 శాతం మేర పింఛన్ల పంపిణీ జరిగిందని, మిగిలిన వారికి శుక్రవారం సచివాలయ సిబ్బంది అందిస్తారని పేర్కొన్నారు.

నాతవరం: మండలంలో తొలి రోజు పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జాగరల రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వివిధ రకాలు పింఛన్లు 11,921 ఉన్నాయన్నారు. వారందరికీ పింఛన్లు పంపిణీ చేసేందుకు 149 మంది సిబ్బందిని వివిధ శాఖల నుంచి నియమించామన్నారు. మిగిలిన లబ్ధిదారులకు పింఛన్లు శుక్రవారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

కె.కోటపాడు: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం మండల వ్యాప్తంగా జరిగింది. సాయంత్రం 5 గంటలకు 10,945 మంది లబ్ధిదారులకుగాను 10,785 మందికి అందించారు. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు పెన్షన్ల అందజేతలో కె.కోటపాడు మండలం 98.54 శాతంతో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీపై ఆరా తీశారు.

మాకవరపాలెం: మండలంలో తొలిరోజు పింఛన్ల పంపిణీ 96.12 శాతం జరిగినట్లు ఎంపీడీవో చంద్రరావు తెలిపారు. మొత్తం 10,215 పింఛన్లు ఉండగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం 5 వరకు 9,819 మందికి నగదు పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి శుక్రవారం అందిస్తామన్నారు. మాకవరపాలెం, జి.వెంకటాపురం, రాచపల్లిలో ఎంపీడీవో, కొండల అగ్రహారం, గిడుతూరులో ఎంఈవో మూర్తి పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

మోగిన ఎస్ఎంసీ ఎన్నికల నగారా



మాడుగుల బాలుర హైస్కూల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎంఈవో దేముడమ్మ, హెచ్‌ఎం



ఎ.కోడూరు పాఠశాల నోటీస్ బోర్డు వద్ద ప్రదర్శించిన ఓటర్ల జాబితా



కాశీపురంలో హెచ్‌ఎంలతో సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవోలు పడాల్‌దాస్, ఉషారాణి



ఎన్నికల షెడ్యూల్ అంటించిన ఎంఈవో, సిబ్బంది

- స్కూళ్లలో నోటిఫికేషన్ విడుదల

మాడుగుల రూరల్: పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల చేశారు. మండలంలోని 66 ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా స్కూళ్ల హెచ్ఎంలు నోటిఫికేషన్లను తల్లిదండ్రులకు అందుబాటులో ఉంచారు. ఈ నెల 8న కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, ప్రమాణస్వీకారం జరుగనుంది. మాడుగుల బాలుర హైస్కూల్ ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను హెచ్‌ఎం ముత్యాల నాయుడితో కలిసి ఎంఈవో దేముడమ్మ విడుదల చేశారు.

కె.కోటపాడు: మండలంలోని 52 పాఠశాలల్లో నిర్వహించనున్న ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను పాఠశాలల నోటీస్ బోర్డుల్లో గురువారం ప్రదర్శించారు. స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులకు సంబంధించి ఓటరు జాబితాపై అభ్యంతరాలను ప్రధానోపాధ్యాయులు స్వీకరించినట్లు ఎంఈవో డీవీడీ ప్రసాద్ తెలిపారు. తుది జాబితాను ఈ నెల 5న పాఠశాలల్లో ఉంచనున్నట్లు వెల్లడించారు.

దేవరాపల్లి: ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఎంఈవోలు బి.పడాల్ దాస్, వి.ఉషారాణి తెలిపారు. ఈ మేరకు కాశీపురం జెడ్పీ హైస్కూల్లో గురువారం మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలను స్వీకరించి 5న తుది జాబితాను ప్రదర్శించాలని సూచించారు. 8వ తేదీన చేతులు ఎత్తే పద్ధతిలో తరగతికి ముగ్గురు చొప్పున సభ్యులను ఎంపిక చేసి, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక జరిపించాలన్నారు. అనంతరం ప్రమాణ స్వీకారంతోపాటు అదే రోజు తొలి ఎస్ఎంసీ సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు.

చోడవరం రూరల్: మండలంలోని 61 పాఠశాలల ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎంఈవో కె.సింహాచలం గురువారం విడుదల చేశారు. 5వ తేదీ లోగా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను పరిష్కరించి, తుది జాబితా వెల్లడించాలని హెచ్ఎంలకు సూచించారు. 8న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు సాయంత్రం కమిటీ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించాలన్నారు. ఎన్నికల నిర్వహణను ఎంఈవో, ఇతర సీఆర్ఎంటీ, ఎంపీడీవో, ఎమ్మార్వోలు పరిశీలిస్తారని తెలిపారు.

రైవాడ నీటి విడుదల నేడు

దేవరాపల్లి: రైవాడ జలాశయం నుంచి ఖరీఫ్‌కు సాగు నీటిని శుక్రవారం విడుదల చేయనున్నట్లు డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు. జలాశయం ఎడమ కాలువ నుంచి 100 క్యూసెక్కులు, కుడి కాలువ నుంచి 75 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తామన్నారు. ఉదయం 10 గంటలకు జలాశయం వద్ద ప్రత్యేక పూజలు జరిపి, ఆయకట్టు రైతులతో కలిసి నీటిని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి వాసుదేవరావు

మాడుగుల: విత్తనోత్పత్తి పథకం ద్వారా ఎంటీయూ–1061 ఇంద్ర రకం విత్తనాలను రాయితీపై 7.50 క్వింటాళ్లు సరఫరా చేస్తున్నట్లు వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. గురువారం అవురువాడలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.